క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 45, కాకర 38, బీర 50, క్యాలీఫ్లవర్ 28, క్యాబేజీ 11, క్యారెట్ 17, దొండ 38, ఆలు 18, ఉల్లి 17, గోకర 55, దోస 35, సొర 9, పొట్ల 13, అరటి 9, చిక్కుడు 55, అర్వి 55, మునగ 55, చిలగడదుంప 40, బీట్‌రూట్ 15, కీర 13, ఫ్రెంచ్ బీన్స్ 85, క్యాప్సికమ్ 45 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు ఆదివారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

కాంగ్రెస్ నిరసనను విజయవంతం చేయండి


దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వాన్ని దుర్మార్గంగా రద్దు చేసినందుకు నిరసనగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నేతల ఆధ్వర్యంలో గాంధీ భవన్‌లో నిరసన దీక్ష మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీకి దేశవ్యాప్తంగా వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆయన పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయించిందన్నారు. ఇందుకు నిరసనగా ఆదివారం గాంధీభవన్‌లో చేపట్టనున్న నిరసన దీక్షను విజయవంతం చేయాలని కోరారు.

నిరుద్యోగులకు న్యాయం జరిగేవరకు పోరు

సైదాబాద్: తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ మహాధర్నాకు మలకపేట నుంచి ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దోమలగూడలోని ధర్నాచౌక్‌కు వెళ్లి పార్టీ నాయకులతో కలిసి ధర్నాలో బైఠాయించారు. అనంతరం ఆయన సైదాబాద్‌లో మాట్లాడుతూ... నిరుద్యోగులకు న్యాయం జరిగేంత వరకు పార్టీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగిస్తామన్నారు.

బీజేపీ నియంతృత్వ వైఖరి దారుణం

చైతన్యపురి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటు సభ్యత్వంపై అనర్హత వేటు వేయటం కేంద్రంలోని బీజేపీ నియంతృత్వ, అణచివేత ధోరణికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. పార్లమెంటు సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వ తీరును ప్రశ్నించే గొంతుక అయిన రాహుల్‌గాంధీకి అడ్డుకట్ట వేసేందుకే అనర్హత వేటుతో దుర్మార్గమైన చర్యకు పూనుకున్నామన్నారు. జిల్లా కోర్టు ఇచ్చిన తీర్పుపై అత్యున్నత న్యాయస్థానంలో సవాలు చేసేందుకు 30 రోజుల గడువు ఇచ్చినా ఆయనపై అనర్హత వేటు వేయటం అన్యాయం అన్నారు. ఎన్నో అవినీతి ఆరోపణలు, క్రిమినల్ కేసులు ఉన్న బీజేపీ ఎంపీలు, మంత్రుల సంగతి ఏంటని ఆయన ప్రశ్నించారు. హాత్ సే హాత్ జోడో యాత్ర ద్వారా ప్రజల హృదయాల్లో చోటు సాధించుకున్న రాహుల్ గాంధీని చూసి జీర్ణించుకులేక... రానున్న ఎన్నికల్లో ఆయనను రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యంలేకే బీజేపీ కుట్రలు చేస్తోందని మల్‌రెడ్డి దుమ్మెత్తిపోశారు.

ఎల్‌బీనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దా

- రూ. వేల కోట్ల వ్యయంతో అభివృద్ధి చేశా
- ప్రజలకు మెరుగైన వసతులు కల్పించా
- సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల ప్రత్యేక చొరవతోనే సాధ్యం
- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



హస్తినాపురంలో జరిగిన పార్టీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: తెలంగాణలో చేసిన అభివృద్ధి మార్పును భారతదేశంలో నలువైపులా చాటేదిశగా సాగుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అందరూ మద్దతు పలకాల్సిన అవసరం ఉందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. రూ. 3 వేల కోట్ల వ్యయంతో ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. శనివారం హస్తినాపురంలోని ఈదులకంటి గార్డెన్‌లో పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి అధ్యక్షతన జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి స్థానిక కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ నుంచి టీఆర్‌ఎస్ పార్టీలోకి మారేటప్పుడు సీఎం కేసీఆర్‌కు 5 డిమాండ్లు పెట్టానని వాటిని నెరవేర్చడం జరిగిందని అన్నారు. ఉద్యమకారులకు ప్రత్యేక స్థానం ఉంటుందని అందరూ కలిసికట్టుగా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ పద్మానాయక్, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, డేరింగుల కృష్ణ, ఆదిలక్ష్మి, ఉదయ్‌రెడ్డి, బాలం ఈశ్వర్, కంచర్ల శివారెడ్డి, గోదల రఘుమారెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, పల్లం శ్రీనివాస్, నాగేశ్వరరావు, నల్ల నాగిరెడ్డి, సయ్యద్ పాషా, శ్రీనివాస్‌నాయక్, అనిత, భీమ్‌నాయక్, సల్వాచారి, గోపీమధు, శ్రీరాములుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలు


చైతన్యపురిలో జరిగిన సమావేశానికి హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు

చైతన్యపురి: బీఆర్‌ఎస్ పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ చైతన్యపురి డివిజన్ నాయకులు, కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం, కాలనీ సంక్షేమ సంఘాల ఆత్మీయ సమ్మేళనం ప్రభాత్‌నగర్‌లోని మాధవరెడ్డి కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఎమ్మెల్సీలు రమణ, దయానంద్‌గుప్తా, రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తాతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... బీఆర్‌ఎస్‌లో ప్రతి కార్యకర్తతో పాటు ఉద్యమకారులకు ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. పార్టీ అనుబంధ సంఘాలలో పదవులు ఉన్న ప్రతి ఒక్కరూ నియోజకవర్గ పరిధిలో జరిగే ప్రతి కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల ప్రత్యేక శ్రద్ధ, సహకారంతో నియోజకవర్గంలో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించి ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలో అత్యధిక పార్కులు, స్విమ్మింగ్‌పూల్‌లను అభివృద్ధి చేశామని ఎమ్మెల్యే వివరించారు. ఎలాంటి విభేదాలు లేకుండా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంగా ఉండి ముందుకు సాగాలన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు తోట మహేష్ యాదవ్, నాయకులు రాపోలు సుధాకర్, చంద్రశేఖర్‌రెడ్డి, శివప్రకాష్, శరత్‌చంద్ర, నాగలక్ష్మి, జయశ్రీ, శేషుకుమారి, విశ్వప్రేమ్, లక్ష్మీనారాయణ, నరేష్, నరేందర్‌రెడ్డి, కిరణ్, జలంధర్, కృష్ణారెడ్డి, చిన్నయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తే కఠిన చర్యలు

ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్


కొత్తపేటలో ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసేందుకు వచ్చిన అధికారులు

నాగోలు: కొత్తపేట గ్రామంలోని సర్వే నెంబర్-143లోని 19 గుంటల ప్రభుత్వ భూమిని పార్కుకు కేటాయించారు. ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేసి ప్లాట్లుగా మార్చుకున్నారని స్థానికులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం ఉప్పల్ మండల రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది, హెచ్‌ఎండీఏ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కొత్తపేటలోని ఉన్న స్థలాన్ని సర్వే చేసి ప్రభుత్వ భూమి హద్దులు నిర్ణయించారు. 6 గుంటల ప్రభుత్వం స్థలం కబ్జాకు గురైందని ఈ సందర్భంగా అధికారులు గుర్తించారు. ప్రభుత్వం స్థలంలో అక్రమ నిర్మాణాలను వెంటనే కూల్చివేస్తామని ఉప్పల్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. త్వరలోనే జీహెచ్ఎంసీ అధికారులకు అప్పగిస్తామని ఆయన స్పష్టం చేశార. హెచ్‌ఎండీఏ ఈఈ పద్మ, ఉప్పల్ మండల రెవెన్యూ సర్వేయర్ ప్రశాంత్, జీహెచ్ఎంసీ సరూర్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ దేవేందర్‌తో ఇతర అధికారులు పాల్గొన్నారు. నాగేశ్వర్‌రావు కాలనీ అధ్యక్షుడు ఎం.రాంనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్, మాజీ అధ్యక్షులు డి.సోమన్న, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు సలహా, సహాయ రక్షణ సమితి కార్యవర్గం

నాగోలు: సమాచార హక్కు సలహా, సహాయ రక్షణ సమితి నూతన కార్యవర్గాన్ని శనివారం ఎల్‌బీనగర్ ఆర్టీసీ కాలనీలోని లైఫ్ ఫౌండేషన్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడిగా వేముల రమాకాంత్, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కొండెడ్డి మహేష్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడిగా పత్తిపాక శేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శిగా గొరోజు శ్రీధర్, జిల్లా కార్యదర్శిగా పసుపుల నితిన్‌సాయిలను నియమిస్తూ సమాచార హక్కు చట్టం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సరికొండ రుషికేశ్వర్‌రాజు, లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ పప్పుల సుధాకర్‌లకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలలో సమాచారం హక్కు కింద దరఖాస్తుదారులకు సమాచారం ఇవ్వడానికి ఉన్న పీఐఓ, ఏపీఐఓలకు ఉచిత శిక్షణ తరగతులు ఇస్తున్నామన్నారు.

హుండీ దొంగ అరెస్ట్


నిందితుడు చంద్రాయుడు

హస్తినాపురం: దేవాలయంలోని హుండీ దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని వనస్థలిపురం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో నివాసం ఉంటున్న డాన్స్ మాస్టర్ బి.చంద్రాయుడు అలియాస్ చిన్నా(45) వనస్థలిపురంలోని గణేష్ ఆలయంలో ఉన్న అమ్మవారి హుండీని గతవారం దొంగిలించాడు. సీసీ కెమెరాల ఫుటేజీల్లో నిందితుడి ఆచూకీ గర్తించారు. నిందితుడు రూ. 12 వేలను దొంగిలించినట్లు పోలీసులు గుర్తించారు. శుక్రవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదు



జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

మన్సూరాబాద్: క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాలని రంగారెడ్డి జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లోని ఇందిరా ఆడిటోరియంలో రంగారెడ్డి జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారిణి డాక్టర్ అరుణకుమారి ఆధ్వర్యంలో శనివారం క్షయవ్యాధి నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ... క్షయ వ్యాధి ప్రాణాంతకం కాదన్నారు. సంపూర్ణ చికిత్స, బలవర్ధకమైన ఆహారం తీసుకుంటే పరిపూర్ణ ఆరోగ్యవంతులు కావచ్చని ఆయన స్పష్టం చేశారు. 2025వ సంవత్సరంలోగా క్షయవ్యాధిని భూస్థాపితం చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులకు పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పౌష్టికాహార కిట్లను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం క్షయవ్యాధి నివారణ కార్యక్రమంలో పాల్గొంటున్న సిబ్బందిని జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో కామినేని మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ అంజయ్య, డిప్యూటీ డీఎంహెచ్ఓలు, జిల్లా ఎన్‌టీఈపీ సిబ్బంది, అభయ ఫౌండేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, అపోలో ఫౌండేషన్, టీబీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

చైతన్యపురిలో వర్షం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్, చైతన్యపురి, కొత్తపేట తదితర ప్రాంతాల్లో శనివారం సాయంత్రం చిన్నపాటి వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతం అయి, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సాయంత్రం చిరుజల్లులు పడటంతో చల్లటి గాలులు వీచటంతో కొంత ఉపశమనం పొందారు.


చైతన్యపురిలో కుస్తున్న వర్షం

‘ఎన్‌ఎంఆర్‌పీఎస్’ జిల్లా అధ్యక్షుడిగా యాదగిరి


యాదగిరికి నియామక పత్రమిస్తున్న రమేష్‌కుమార్

నాగోలు: జాతీయ మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎన్ఎంఆర్‌పీఎస్) రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా ఎల్‌బీనగర్‌కు చెందిన చిటుపాక యాదగిరి మాదిగను నియామిస్తూ ఎన్ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బి.ఎస్. రమేష్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేసి నియామకపత్రాన్ని ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతూ... ప్రస్తుత పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదగిరి మాట్లాడుతూ... మాదిగ, మాదిగ ఉప కులాలు అభివృద్ధి చెందాలంటే ఎస్సీ వర్గీకరణతోనే సాధ్యమవుతుందని తెలిపారు. తనపై నమకంతో అవకాశం కల్పించిన ఎన్ఎంఆర్‌పీఎస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు పాల్గొన్నారు. సంఘం నాయకులు చిటుపాక ప్రభాకర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షులు మోదుగుల లాజర్ మాదిగ, రాష్ట్ర సీనియర్ నాయకులు కుశాల్ కుమార్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొయ్యడ వెంకటస్వామి మాదిగ, ఎమ్మార్పీఎస్ నేతలు చిప్పలపల్లి నరసయ్య పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ లోక్‌సభ సభ్యత్వం రద్దు హేయం: కాంగ్రెస్


మలక్‌పేట లూయిస్ బ్రెయిలీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మలక్‌పేట: ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని రద్దు చేయడం హేయమైన చర్య అని.. ఆ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో పార్టీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి శనివారం నల్లగొండ క్రాస్ రోడ్‌లో ఉన్న లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ... శిక్ష అమలుకు న్యాయస్థానం నెల రోజులు గడువు ఇచ్చినా లోక్‌సభ సెక్రటరియేట్ మాత్రం 24 గంటలలోపే ఆయనను అనర్హుడిగా ప్రకటించడం కేంద్రప్రభుత్వ నియంతృత్వ విధానాని పరాకాష్టగా అభివర్ణించారు. నాయకులు చౌకి రవికుమార్, బాబుశ్రీనివాస్, షకీల్ అహ్మద్, రామకృష్ణ, కృపాకర్‌రెడ్డి, మదన్‌రెడ్డి, రమేష్, సంఘమేష్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూత అందరి బాధ్యత


మేళాలో పాల్గొన్న కార్పొరేటర్ అరుణ, ఆర్టీసీ అధికారులు

సైదాబాద్: దివ్యాంగులకు చేయూతనివ్వడం ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా భావించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. శనివారం సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న హనుమాన్ మఠం ప్రాంగణంలో దివ్యాంగులకు నిర్వహించిన ఉచిత బస్ పాస్ మేళాకు మంచి స్పందన లభించింది. వంద మందికి పైగా దివ్యాంగులు మేళాలో పాల్గొని దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులు అందరికీ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ తన సొంత నిధులతో సిటీ, డిస్ట్రిక్ బస్‌పాసులు అందజేస్తారు. దివ్యాంగులు సిటీ బస్‌పాస్‌లతో జీహెచ్ఎంసీ పరిధిలోని ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా, తెలంగాణ నుంచి నడిచే అన్ని ఆర్టీసీ సర్వీసుల్లో 50 శాతం రాయితీతో ప్రయాణించవచ్చని మేళాలో పాల్గొన్న ఆర్టీసీ అధికారులు తెలిపారు. అంధులు, మానసిక దివ్యాంగులతో పాటు మరో సంరక్షకుడికి కూడా రాయితీ వర్తిస్తుందని వారు తెలిపారు. బీజేపీ నియోజకవర్గ నేత కొత్తకాపు రవీందర్‌రెడ్డి, ఆర్టీసీ అధికారులు రాంచందర్, ఉదయ్‌కుమార్, రజనీకాంత్ పాల్గొన్నారు.

ఘనంగా ‘రవీంద్రభారతి’ స్నాతకోత్సవం


స్నాతకోత్సవంలో విద్యార్థులు, అధ్యాపకులు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం ప్రైమరీ విద్యార్థులకు స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పానసీయ డెంటల్ కాలేజ్ ప్రొఫెసర్ డాక్టర్ ద్వితా అనిమిరెడ్డి హాజరై చిన్నారులకు పతకాలు, ప్రశంస ప్రతాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పిల్లలకు క్రమశిక్షణ, కొత్త విషయాలు తెలుసుకోవాలనే ఆసక్తిని పెంపొందించాలన్నారు. పిల్లలపై తల్లిదండ్రులు, గురువుల ప్రభావం ఎంతో ఉంటుందని, వారిని ఉత్తమ భావి పౌరులుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. జోనల్ డీన్ జ్యోతి, హెచ్ఎం శిరీష, డీఐ దయాకర్ పాల్గొన్నారు.

చైతన్యపురి బ్రాంచ్‌లో...

చైతన్యపురి: రవీంద్రభారతి పాఠశాల చైతన్యపురి బ్రాంచిలో శనివారం ప్రీప్రైమరీ, యూకేజీ పూర్తి చేసిన చిన్నారులకు కాన్వకేషన్ నిర్వహించారు. బుడిబుడి అడుగులు వేసుకుంటూ టోపీ, కోటు ధరించి పట్టా పుచ్చుకున్నారు. ఎక్సైజ్ అధికారి గీతా గ్రేస్ ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులకు పట్టాలు ప్రదానం చేశారు. చిన్నారులకు చదువు పట్ల ఆసక్తి కల్పించేందుకు, భయం వీడేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల డీన్ ప్రమీల, ప్రిన్సిపాల్ బ్యూలా తెలిపారు.


పట్టాలు అందుకున్న చైతన్యపురి బ్రాంచ్ చిన్నారులు

గంజాయి విక్రేతల అరెస్ట్

హస్తినాపురం: నిషేధిత గంజాయిని గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్న నలుగురిని వనస్థలిపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల సమాచారం మేరకు... వనస్థలిపురం శ్రీకృష్ణా నగర్‌కాలనీకి చెందిన కొనిగపోగు శివప్రసాద్ , స్వామికన్నం జయవర్ధన్, బొక్కల అజయ్ కుమార్‌రెడ్డి, ఉబ్బ సాయికిరన్‌లు కొంతకాలంగా గుట్టు చప్పుడు కాకుండా గంజాయిని పలువురికి అమ్ముతున్నారు. విశ్వసనీయ సమాచారం అందుకున్న ఎల్‌బీనగర్ ఎస్‌వోటీ, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా శుక్రవారం దాడిచేసి నలుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 500 గ్రాముల గంజాయి ప్యాకెట్లు, రూ. వెయ్యి, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వివరించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

బడంగ్‌పేట్: ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని గాయత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ పద్మ, వాటర్ వర్క్స్ డీజీఎం హరీశ్ కుమార్, మేనేజర్ ప్రియాంక హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి కుటుంబం నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణానికి తప్పనిసరిగా ఇంకుడు గుంత నిర్మించుకోవాలన్నారు. నీరు అత్యంత విలువైనదని, ప్రతి వర్షపు నీటి చుక్కను నిలువ చేసుకోవాలన్నారు. నీటిని పొదుపుగా వాడుకొని భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు.

పథకాల ఘనత మాదే

- రాష్ట్రంలో కేసీఆర్ పథకాలు చేరని ఇల్లు లేదు
- అభివృద్ధిలో దూసుకుపోతున్న ఇబ్రహీంపట్నం
- ప్రగతి నివేదన యాత్ర ముగింపు సభలో మంత్రి కేటీఆర్


మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేసిన వాడే నిజమైన నాయకుడని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చేరని ఇల్లు లేదని, తొమ్మిదేళ్లలో ఊహించని రీతిలో అభివృద్ధి సాధించామన్నారు. ప్రస్తుతం తెలంగాణ దేశానికే పాఠాలు చెప్పే స్థాయికి చేరుకుందన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తనయుడు ప్రశాంత్‌కుమార్ రెడ్డి చేపట్టిన ప్రగతి నివేదన యాత్ర శనివారం ముగింపు సందర్భంగా పెద్ద అంబర్‌పేటలోని ఔటర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలన్న సంకల్పంతో పాదయాత్ర చేపట్టి నియోజకవర్గ ప్రజల్లో స్థానాన్ని సంపాదించిన మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి పట్టుదల అభినందనీయమని పేర్కొన్నారు. ఈ యాత్రలో పది సమస్యలను తమ దృష్టికి తీసుకొచ్చారని, వాటిని ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని కేటీఆర్ హామీ ఇచ్చారు. ఇప్పటికే ఇబ్రహీంపట్నం నియోజకవర్గం వేగవంతంగా అభివృద్ధి చెందుతోందని, యువతకు ఉపాధి కల్పించేందుకు వీలుగా పరిశ్రమల స్థాపనకు కృషి చేస్తున్నామన్నారు. కొంగరలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఫాక్స్‌కాన్ పరిశ్రమ ఏర్పాటు కానుందని, లక్ష మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు.

లీకేజీలతో సంబంధం లేదు

పొరపాట్లు జరగడం సహజమేనని, చిన్న తప్పులను పెద్దగా చేసి ప్రభుత్వంపై విపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీలో లీకేజీలు జరిగిన మాట వాస్తవమేనని, దీంతో ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తప్పిదాలను గుర్తించి, మళ్లీ పారదర్శకంగా నిర్వహించాలనే ఉద్దేశంతో పరీక్షలను రద్దు చేసినట్లు గుర్తు చేశారు.

రూ. 2,400కోట్లతో అభివృద్ధి

నియోజకవర్గ అభివృద్ధికి రూ.2,400 కోట్లు ఖర్చు చేశామని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని నాలుగు మున్సిపాలిటీల అభివృద్ధికి రూ.10కోట్ల చొప్పున కేటాయించాలని కేటీఆర్‌ను కోరారు. పెద్దఅంబర్‌పేట-పసుమాముల రోడ్డు విస్తరణ, మూసీ ట్రంక్ లైన్‌నిర్మాణం, బండరావిరాల మైనింగ్‌జోన్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుతో పాటు యాచారం ఫార్మాసిటీ, కొహెడాలో పండ్ల మార్కెట్, మంచాలలో ఐటీ పార్కుల నిర్మాణానికి దృష్టి సారించాలని కోరారు.

ప్రజాసేవకే జీవితం అంకితం

‘పదవులున్నా .. లేకపోయినా ప్రజాసేవకే నా జీవితాన్ని అంకితం చేస్తా’ అంటూ బీఆర్‌ఎస్ నేత మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. 63 రోజుల పాటు ప్రజల్లోనే ఉన్న తనను ప్రతి ఒక్కరూ సొంత బిడ్డలా ఆదరించారని భావోద్వేగానికి గురయ్యారు. ప్రగతి నివేదన యాత్రలో తన దృష్టికి వచ్చిన సమస్యలను కేటీఆర్ ద్వారా పరిష్కారం అయ్యేలా కృషి చేసి, ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటానన్నారు. సభలో మంత్రి సబితారెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, ఎల్.రమణ, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, రైతుబంధు జిల్లా కోఆర్డినేటర్ వంగేటి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, దాసోజు శ్రావణ్‌చారి పాల్గొన్నారు.